క్లుప్తంగా

రాజీవ్‌నగర్‌లో 170 కోతుల పట్టివేత..

సత్తుపల్లిరూరల్: రాజీవ్‌నగర్‌లో కోతులు ఎక్కువగా ఉన్నాయని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, మున్సిపల్ కమిషనర్‌కు తెలుపగా ఆదివారం కోతులను పట్టే స్పెషల్ బృందాన్ని పిలిపించారు. గత మూడురోజులుగా ఆ బృందం పర్యవేక్షించి కాలనీ పక్కన ఉన్న పామాయిల్ తోటల్లో బోనులు పెట్టించారు. ఆదివారం సుమారు చిన్న, పెద్ద కోతులు కలిపి 170కిపైగా బోను ద్వారా పట్టుకున్నారు. ఈ కోతులను పట్టణానికి, గ్రామాలకు దూరంగా ఉన్న అటవీ ప్రాంతంలో వదిలి పెట్టనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా తెలిపారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న పాషా

బోనకల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ముస్లిం ఐక్య సంఘం మండల అధ్యక్షుడు షేక్. మహబూబ్ పాషా అన్నారు. ఆదివారం మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధార్మిక సభలో ఆయన మాట్లాడారు. ధార్మిక విద్యను అభ్యసించి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. నైతిక విలువలను పెంపొందించే విధంగా విద్యా విధానం ఉండాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్య సంఘ నాయకులు మౌలానము జాహిద్, షేక్ హుస్సేన్ సాహెబ్, అఫ్రోజ్ అహ్మద్, గౌసుద్దీన్, షాజహాన్, దస్తగిరి, షరీఫ్, రంజాన్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బోనకల్: మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి టి.పవన్ కుమార్ మాట్లాడుతూ.. శారీరక శ్రమ లేకపోవడంతో పాటు వ్యాయామం చేయకపోవడం వలన బీపీ, షుగర్ వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, బొమ్మినేని కొండలరావు, ఆకేన పవన్, యంగల గిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వైరారూరల్: మండలంలోని స్నానాల లక్ష్మీపురం ఫీడర్ పరిధిలోని లక్ష్మీపురం, ముసలిమడుగు, కొండకొడిమ, ఖానాపురం గ్రామాల్లో విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 9 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ సుందర్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దుస్తులు పంపిణీ



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ మనవరాలు గోహిత లక్ష్మి జన్మదిన వేడుకలకు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మదన్‌లాల్ సతీమణి మంజుల, కుమార్తె, అల్లుడు మనీషా లక్ష్మి, అశోక్‌లు.. కేక్ కట్ చేయించి వృద్ధులకు దుస్తులు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. అనంతరం వృద్ధులకు మిఠాయిలు, సీట్లు పంపిణీ చేశారు. వెంకటేశ్వర్లు, సీతారాములు, విశ్వేశ్వరరావు, రవి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, రాము, కిరణ్‌కుమార్, సునీత తదితరులున్నారు.

భవనాలు సరే.. రోడ్డేది ?

గిరిజన సంక్షేమ గురుకులానికి రహదారి ఇక్కట్లు

- ముసలిమడుగు నుంచి బీటీ రోడ్డు నిర్మించినా ఫలితం శూన్యం
- తాటిపూడి నుంచి రోడ్డు నిర్మించాలని ప్రతిపాదనలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



కొత్తముసలిమడుగులోని ఎస్టీ గురుకుల భవనం



వర్షాలకు అధ్వానంగా మారిన తాటిపూడి - కొత్తముసలిమడుగు లింక్ రోడ్డు

వైరారూరల్: అన్ని ఉన్న అల్లుడు నోట్లో శని అన్న చందంగా ఉంది.. గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల పరిస్థితి. మండలంలోని కొత్త ముసలిమడుగులో రూ.కోట్లు వెచ్చించి నిరుపేద విద్యార్థుల కోసం నిర్మించిన కళాశాలకు సరైన రోడ్డుమార్గం లేకపోవడంతో ప్రతి ఏటా వర్షాకాలంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కొన్నిసార్లు విద్యార్థినులు అనారోగ్యాలు, విషసర్పాలు కాటుకు గురైన సమయంలో కళాశాల సిబ్బంది వారిని ఆస్పత్రికి తీసుకెళ్లడానికి వ్యయప్రయాసాలు పడాల్సి వస్తుంది. ముసలిముడుగు నుంచి నూతన ముసలిమడుగు వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టినప్పటికీ ఎస్టీ గురుకులానికి వెళ్లేందుకు ప్రధాన మార్గంగా ఉన్న తాటిపూడి నుంచి నూతన ముసలిముడుగు లింక్ రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రతి ఏటా వర్షాకాలంలో రాకపోకలకు కష్టంగా మారాయి.

ప్రస్థానం మొదలైందిలా..

గత తొమ్మిదేళ్ల కిందట అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వైరా నియోజవర్గం, పరిసర ప్రాంతాల విద్యార్థినీల లబ్ది కోసం వైరా నియోజకవర్గ కేంద్రానికి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలను మంజూరు చేసింది. వైరా పట్టణ కేంద్రంలో పాఠశాల నిర్మాణానికి తగిన ప్రభుత్వ స్థలం లేనందున మండలంలోని కొత్త ముసలిమడుగు గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి సుమారు 640 మంది విద్యార్థుల సామర్థ్యం ఉండేలా రూ. 4.20 కోట్ల అంచనా వ్యయంతో.. గ్రౌండ్ ఫోర్‌తో కలిపి మొత్తం నాలుగు అంతస్తుల భవన నిర్మాణాన్ని చేపట్టారు. ప్రస్తుతం ఈ గురుకులంలో 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు సుమారు 580 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

రెండేళ్ల కిందట రూ. 7.70 కోట్ల నిధులు మంజూరు..

కొత్త ముసలిమడుగులో గిరిజన సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలకు రూ. 4.20 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు అంతస్తుల భవనం నిర్మించారు. గత బీఆర్ఎస్ హయాంలో విద్యార్థుల సౌకర్యార్థం డార్మెటరీ హాల్, డైనింగ్ హాల్, కిచెన్, స్టాఫ్ కోర్టర్స్ కోసం రూ. 7.70 కోట్ల నిధులతో నిర్మించగా.. ఎమ్మెల్యే రాములు నాయక్ అధికారులతో కలిసి భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఆ పనులు నిర్మాణ దశలో ఉన్నట్లు సంబంధిత శాఖాధికారులు తెలిపారు.

ప్రధాన మార్గంగా తాటిపూడి రోడ్డు..

కళాశాల, పాఠశాలకు వెళ్లేందుకు మధిర, జగ్గయ్యపేట రాష్ట్రీయ దారి మార్గమధ్యలో తాటిపూడి - కొత్తముసలిమడుగు లింక్ రోడ్డు సులువుగా ఉండడంతో అందరూ ఈ మార్గంద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతీ వర్షాకాలంలో సుమారు 3కిలో మీటర్ల మేర ఉన్న ఈ లింక్‌రోడ్డు బురదమయంగా మారడంతో నిత్యావసరాలు తీసుకెళ్లే వాహనాలు దిగబడి ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు అభివృద్ధికై ప్రతిపాదనలు పంపినా కాగితాలకే పరిమితమవుతున్నాయి తప్ప ఆచరణకు నోచుకోవడం లేదు. ఇప్పటికైనా ఈ లింక్ రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.



నిర్మాణ దశలో ఉన్న డార్మెటరీ హాల్

ప్రతిపాదనలు చేశాం..



ఇప్పటికే ఎస్టీ గురుకుల పాఠశాలకు డార్మెటరీ హాల్, డైనింగ్ హాల్, కిచన్, స్టాఫ్ కోర్టర్స్ కోసం రూ. 7.70 కోట్ల నిధులు మంజూరు కావడంతో భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. దాంతో ఇటుగా తాటిపూడి–కొత్తముసలిమడుగు లింక్ రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కి ప్రతిపాదనలు చేశాం. ఆయన సానుకూలంగా స్పందించి రోడ్డు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

– కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఎంఈఓ, వైరా

ప్రజాకళలను బతికించుకోవాలి



ప్రజానాట్యమండలి నూతన కమిటీతో రాష్ట్ర నాయకులు

సత్తుపల్లిరూరల్: అంతరించి పోతున్న ప్రజాకళలను బతికించుకోవడానికి కళాకారులు, కళాభిమానులు, కళా పోషకులు, ప్రజలు కృషి చేయాలని ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకుడు ఏఎస్ కుమార్ అన్నారు. సత్తుపల్లి మదర్‌థెరిస్సా టెక్నో స్కూల్‌లో ఆదివారం జరిగిన డివిజన్ మహాసభలో మాట్లాడారు. ప్రజల జీవితాల్లో పెనుసవాల్‌గా ఉన్న టి.వి., సినిమా, సోషల్ మీడియా రంగాల్లో విపరీతం ధోరణి పోకడలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇది ప్రజాకాళాకారులకు మాత్రమే సాధ్యమని స్పష్టం చేశారు. జిల్లా కార్యదర్శి వేముల సదానంద్ మాట్లాడుతూ కళాకారుల సమస్యలను పట్టించుకోవటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జీవనోపాధి కరువై అనేక ఇబ్బందులకు గురౌతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జానపద వృత్తి కళాకారులను ఆదుకోవాలని కోరారు. అనంతరం సత్తుపల్లి డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కె.సత్యం, ఎ.సునందరావు, ఉపాధ్యక్షుడిగా భిక్షం, వెంకట్రావ్, సహాయ కార్యదర్శిగా ఎం.నాగమణి, పి.కృష్ణవేణిలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఐద్వా మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, రావుల రాజబాబు, యశోద, అబ్రహం, నారాయణరెడ్డి, శ్రీను, రాములు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగి నిజాయితీ

మధిర: నిర్మానుష ప్రదేశంలో బంగారం, నగదు ఉన్న ఒక బ్యాగ్‌ను గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి విద్యుత్ శాఖ ఉద్యోగి తన నిజాయితీ చాటుకున్నాడు. ఆదివారం మధిర పట్టణంలో విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న బాబురావు స్థానిక సిద్ధారెడ్డి బజార్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ సమయంలో అనుమానాస్పద స్థితిలో, ఎవరూ లేని ఆ ప్రాంతంలో కనిపించిన బ్యాగును తెరచి చూడగా బంగారంతో పాటు నగదు కూడా ఉంది. ఆ బ్యాగు తీసుకుని ఆయన పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు. ఎస్‌హెచ్‌వో రమేష్‌కు జరిగిన విషయం చెప్పాడు. బాబురావు నిజాయితీని మెచ్చుకున్న పోలీస్ అధికారి రమేష్ అతనిని శాలువాతో సన్మానించి అభినందించారు. అదేవిధంగా బాబురావు నిజాయితీని తెలుసుకున్న విద్యుత్ శాఖ వైరా డివిజన్ డీఈ బండి శ్రీనివాసరావు, ఏడీఈ ఎం.అనురాధ, పట్టణ ఏఈ ఎస్ అనీల్ కుమార్ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు రాజారత్నం, కోటేశ్వరరావు, క్రాంతి కిరణ్, హరి తదితరులు పాల్గొన్నారు.



బాబురావును సన్మానిస్తున్న రమేష్

సీతయ్య సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న శీలం వెంకటరెడ్డి

మధిర: మడుపల్లి గ్రామాభివృద్ధికి జిల్లా సీతయ్య కుటుంబం అందిస్తున్న సేవలు మరువలేనివని భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి తెలిపారు. ఇటీవల మృతి చెందిన జిల్లా సీతయ్య సంస్మరణ సభ ఆదివారం ఆయన స్వగ్రామం మడుపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. సీతయ్య తనయుడు రామకృష్ణ అనేక సేవా కార్యక్రమాలతో సమాజాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. తన తండ్రి ఆరోగ్యం పట్ల రామకృష్ణ తీసుకున్న శ్రద్ధ పలువురికి ఆదర్శం అని తెలిపారు. కార్యక్రమంలో చింతల నాగవేణు, పంగా శేషగిరి, ఊట్ల కొండలరావు, మల్లవరపు అప్పారావు, రేగండ్ల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలే లక్ష్యంగా నైపుణ్య శిక్షణ

కొణిజర్ల: ఉద్యోగ కల్పనే లక్ష్యంగా మండలంలోని తనికెళ్లలోని గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో నంది ఫౌండేషన్ హైదరాబాద్ వారిచే బీఎస్సీ 3వ సంవత్సరం చదువుతున్న బాలికలకు ఎంప్లాయబిలిటీ స్కిల్స్‌పై వారం రోజుల పాటు నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణకు రిసోర్స్ పర్సన్లుగాథామస్, ఓంకార్ బాలికలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం ముగింపు సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.రజని మాట్లాడుతూ.. బాలికలు చదువుల తర్వాత ఉద్యోగాన్వేషణలో శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల కోఆర్డినేటర్‌లు కేపీ ఐశ్వర్య, దీప్తి, వైస్ ప్రిన్సిపాల్ నవ్య పాల్గొన్నారు.

జాగీర్దార్ భూములకు పట్టాలు ఇవ్వాలి

కొణిజర్ల: మండలంలోని సింగరాయపాలెంలోని జాగీర్దార్ వద్ద సన్న, చిన్న కారు రైతులు కొనుగోలు చేసుకున్న సీలింగ్ భూములకు ప్రభుత్వం తక్షణమే పట్టాలు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం నాయకులు సింగరాయపాలెంలోని భూములను పరిశీలించారు. 1950–60 పూర్వం నుంచి కొనుగోలు చేసినట్లు ప్రభుత్వ పహణీలో అనుభవదారుడిగా ఉంటున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలన్నారు. రైతు సంఘం నాయకులు కృష్ణార్జునరావు, రాంబాబు, రోషన్‌బేగ్, రామారావు, అఫ్జల్, మహబూబ్, అజయ్, మధు, వెంకటి, బిచ్చాలు, నాగులు, రైతులు పాల్గొన్నారు.


సూర్యనారాయణకు నివాళి..

కల్లూరురూరల్: మండలంలోని ముచ్చవరం గ్రామంలో ఇటీవల మరణించిన గంగవరపు సూర్యనారాయణ చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగవరపు సూర్యనారాయణ కుమారుడు, మాజీ సర్పంచ్ గంగవరపు వెంకటేశ్వరరావు(శ్రీనివాసరావు) కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అజయ్‌కుమార్, డాక్టర్ రఘు, యూత్ నాయకుడు రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ నీరజాదేవి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

పరామర్శ..

తల్లాడ: మండలంలోని పలు కుటుంబాలను ఆదివారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరామర్శించారు. అన్నారుగూడెంలో గుమ్మా కేశవరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. గోపాలపేటలో సున్నా జానకి రామయ్య కుటుంబాన్ని, బాలపేటలో పూర్ణకంటి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు, దేవేంద్ర, వెంకటనరసయ్య, వెంకట నరసింహారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి



బంజరలో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

ఎర్రుపాలెం: చేపల వేటకు వెళ్లి చనిపోయిన మూడు గిరిజన మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య, మండల కమిటీ కార్యదర్శి మద్దాల ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బంజర గ్రామంలో మృతుల కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు. వ్యవసాయ కూలీలు ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబాలకు రూ.5లక్షలు చెల్లిస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు బీమాను వర్తింపచేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పందించి ఆదుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన వారిలో నాయకులు ఆంగోతు వెంకటేశ్వర్లు, మంత్రియా, బిక్షాలు, నాగలవంచ వెంకటరామయ్య, దివ్వెల వీరాంజనేయులు, తదితరులున్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళులు

వైరారూరల్: మండలంలోని పాలడుగు గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు, మాజీ సర్పంచ్, మాజీ వైస్ ఎంపీపీ వేల్పుల నరసింహారావు (90) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్.. నరసింహారావు భౌతికాయానికి పూలమాలలతో నివాళులర్పించి కుటుంబ సభ్యులు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీపీ పావని, సత్యం, హనుమంతరావు, పుల్లారావు, మురళి తదితరులున్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



వైరా: కేక్ కట్ చేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, స్నేహితులు



మధిర: కేక్ కట్ చేస్తున్న నరసింహారెడ్డి

వైరా: వైరా పాతబస్టాండ్ సెంటర్‌లో ఆదివారం వైరా మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో మిట్టపల్లి నాగి, రాజశేఖర్, మచ్చా రామారావు, రేచర్ల సత్యం, జాలాది రామకృష్ణ, కొమ్మూరి శ్రీనివాస్, దార్న వెంకటేశ్వరరావు, దేవిశెట్టి సైదులు తదితరులు పాల్గొన్నారు.

మధిర: మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మిడ్ స్ట్రీట్ స్వీట్స్ అండ్ బేకరీ షాప్‌లో ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డి కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. స్నేహాని కన్నా మిన్న లోకాన లేదురా అనే మాట వాస్తవమని తెలిపారు. స్నేహితులు ఒకరికి మరొకరు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. రాంబాబు, శ్రీనివాసరావు, సత్యానారాయణ, కోటేశ్వరరావు, రాంబాబు, ఆదాం, జానీ, సైదులు, అబ్దుల్ హనీఫ్, ఎల్వీ రెడ్డి, మస్తాన్ రెడ్డి, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్నేహితులు ఒకరి కొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సమిష్టిగా భోజనాలు చేశారు. తల్లాడ పట్టణంలో బాల బాలికలు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టి వేడుకలు జరుపుకున్నారు.

గ్రామాల్లో బోనాల జాతర



ముదిగొండ: మాధాపురంలో బొడ్రాయి వద్ద బోనాలు సమర్పిస్తున్న భక్తులు

ముదిగొండ: మండలంలోని మేడేపల్లి, న్యూలక్ష్మీపురం, మాధాపురం గ్రామాల్లో ఆదివారం బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. మహిళలు, రైతులు బొడ్రాయికి, ముత్యాలమ్మకు జలాభిషేకం చేశారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా దేవాలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామాల్లో సందడి నెలకుంది.

కారేపల్లి: మండలంలోని లింగంబంజర, కారేపల్లి క్రాస్‌రోడ్డు, శ్రీవెంకటసాయినగర్ గ్రామాల్లో ఆదివారం బోనాల వేడుకను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని డప్పు వాయిద్యాల నడుమ ప్రదర్శనగా గ్రామంలో కొలువు తీరిన ముత్యాలమ్మతల్లి గుడి వద్దకు వెళ్లి.. బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ముత్యాలమ్మతల్లి ప్రతిష్ఠ మహోత్సవం



ముత్యాలమ్మ అమ్మవారి పునఃప్రతిష్ఠ పూజలు చేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని వెంగళరావునగర్ శ్రీముత్యాలమ్మ తల్లి అమ్మవారి పునఃప్రతిష్ఠ మహోత్సవం పూజలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, ముత్తైదువులతో దేవతాపూజలు, రుద్రహోమం, 1008 బిందెలలతో అమ్మవారికి జలాధివాసం, నగర సంకీర్తన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రామడుగు గురుబ్రహ్మాచార్యులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా 'జలబిందెలు'

ముదిగొండ: మండలపరిధిలోని పమ్మిలో శ్రీకంఠహేశ్వరస్వామి దేవాలయం నూతనంగా నిర్మించనున్న సందర్భంగా గ్రామంలో పమ్మి దేవేగౌడ ఆధ్వర్యంలో ఆదివారం జలబిందెల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మంగళ హారతులు, పంచామృతాలతో, ఆలయ ప్రవేశం, ఆలయం వద్ద గణపతి పూజ, కౌండన్య మహాముని పూజతో స్వామికి, అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి భక్తిశ్రద్ధలతో మేలతాలతో ఆలయం వరకు చేరుకుని పూజలు నిర్వహించారు. మహిళలచే కుంకుమ పూజ చేశారు.

లక్ష్మీపురంలో ప్రారంభమైన తీజ్ ఉత్సవాలు



సంత్ సేవాలాల్ మహారాజ్‌కు పూజలు చేస్తున్న లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు దశరథ్‌నాయక్, గిరిజనులు

కల్లూరురూరల్: గోర్ బంజారాలు(లంబాడీలు) నిర్వహించుకునే తీజ్ ఉత్సవాలు కల్లూరు మండలంలోని లక్ష్మీపురం(రాళ్లబంజరు)లో ఘనంగా ప్రారంభమైనాయి. ఈ ఉత్సవాలను గిరిజనులు సాంప్రదాయ బద్ధంగా 9 రోజుల పాటు నిర్వహించనున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో నిర్వహించే ఈ పండుగ ప్రకృతి ఆరాధన పండుగగా గిరిజనులు భావిస్తారు. ఈ సందర్భంగా వివిధ రకాల పంటల విత్తాలను కొన్నికొన్ని పాత్రల్లో ఉంచి అవి మొలకలు వచ్చిన తర్వాత వాటిని పూజిస్తారు. పంటలు బాగా పండాలని, వివాహం కాని గిరిజన యువతులు తమకు మంచి భర్తలు దొరకాలని, తన కుటుంబాలు అష్ట ఐశ్వర్యాలతో తులతూగాలని కోరుతూ సేవాలాల్ మహారాజ్‌కు, మేరా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గోరు బంజారాలో మాత్రమే ప్రత్యేకంగా చేసే ఈ ఉత్సవంలో 9వ రోజు తేజ్ దేవతలను నిమజ్జనం చేస్తారు.

రంగంబంజర గ్రామంలో..

తల్లాడ: మండలంలోని రంగంబంజర గ్రామంలో ఆదివారం లంబాడీలు సాంప్రదాయబద్ధంగా బోగ్ బండారో పండుగను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా మేరమా ఆడి సంత్ సేవాల్ మహారాజ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి బోగ్ బండారో నిర్వహించారు. కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ధర్మసోత్ దశరథ్ నాయక్, రామా నాయక్, సైదా నాయక్, శ్రీను నాయక్, శంకర్ నాయక్, నాగేశ్వరరావు నాయక్, ద్వలిబాయి, శిల్పాబాయి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఆదరణ పెరుగుతోంది..



కారేపల్లిలో ఇందిరమ్మ లబ్ధిదారుడి ఇంటికి శంకుస్థాపన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కారేపల్లి: ఇందిరమ్మ ఇండ్ల మంజూరుతో పేదలు సంతోషంగా ఉన్నారని, దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి ఆదరణ పెరుగుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల అన్నారు. ఆదివారం కారేపల్లి బీసీ కాలనీ, భారత్ నగర్ కాలనీల్లో ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధిస్తుందని, గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తలారి చంద్రప్రకాశ్, నాయకులు సురేందర్ మనియార్, సొసైటీ డైరెక్టర్ ఐలయ్య, మేదరి టోనీ వీరప్రతాప్, హనీఫ్, శ్రీనివాసరావు, తాజుద్దీన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎండిన వృక్షం.. పొంచి ఉన్న ప్రమాదం





తల్లాడ - కొత్తగూడెం రోడ్డులో ఒరిగిన వృక్షం

తల్లాడ: అవసరం ఉంటే పచ్చని చెట్లను నరుకుతారు. ఎండిపోయిన పెద్ద వృక్షం మాత్రం ప్రమాదకరంగా ఉన్నా చూస్తూనే పోతుంటారు. తల్లాడ ఊరు బయట భద్రాద్రికొత్తగూడెం జిల్లాకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో ఇలా రోడ్డు మీదకు కొమ్మలు వచ్చిన దురిశిన చెట్టు ఏ కారణం చేతనో ఎండిపోయింది. దాని కొమ్మలు రోడ్డుమధ్యలోకి ఉండి విరిగిపడేలా ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ దారిలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అసలే వానాకాలం.. ఈదురుగాలులతో కురుస్తున్న వర్షాలకు చెట్టుకొమ్మలు ఎప్పుడు ఎవరిమీద పడుతాయోనని వాహనదారులు, మరీ ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కానీ సంబంధిత ఆర్అండ్‌బీ శాఖాధికారులు మాత్రం అదేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.